# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 49 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 23 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :49 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 23 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు..



### షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు థియరీ పరీక్షల నిర్వహణ
- ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్, ఫిబ్రవరి 25 నుంచి సెకండియర్ పరీక్షలు
- ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు
- ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని బోర్డు వెల్లడి
- పండుగలు, సెలవులను బట్టి తుది షెడ్యూల్‌లో మార్పులకు అవకాశం

- మిగతా 2లో

## ఏపీకి మరో తుపాను ముప్పు?

### బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా
- తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు

2లో





## పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22వ SIPB సమావేశం
- గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం

- మిగతా 2లో



## ఎంత వరకైనా పోరాడదాం

- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

- మిగతా 2లో

# ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

## పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు
- కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు
- కనిగిరి, యర్రగొండపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్
- ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్



రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది.



## సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి..

### భారతీయుడి సహా ఇద్దరి మృతి

- సౌదీలోని దమ్మామ్ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారుల దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయుడు, ఒక సౌదీ పౌరుడు మృతి
- యెమెన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం విఫలమవడంతో పెరిగిన దాడులు
- సౌదీ చమురు, పౌర సదుపాయాలపై దాడులు తీవ్రతరం చేసిన హౌతీలు
- ఎర్ర సముద్రంలో ఆయిల్ షిప్‌మెంట్లను కూడా అడ్డుకుంటున్న తిరుగుబాటుదారులు

వివరాలు 2లో..



## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నవంబర్ 1కి వాయిదా

పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పోలింగ్ వాయిదా పడింది. 99 పట్టణ, నగర సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ జరగనుంది. నవంబర్ 3న ఫలితాలను వెల్లడిస్తారు. మైదుకూరు పోలింగ్ తేదీని ఈసీ ప్రకటించలేదు. మైదుకూరులో మళ్లీ నామినేషన్ల ప్రక్రియ, తర్వాతే

వివరాలు 2లో..

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం



### 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తుల ప్రశంస

- మిగతా 2లో



## స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన..

## ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు

- మిగతా 2లో

## డిండికి నీటి తరలింపు ఆపండి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన

2లో





## మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు..

### రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం
- రాహుల్ విదేశీ పర్యటనలపై బీజేపీ నేతల వరుస ఆరోపణలు
- జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా
- నిరసనలు కాదు.. గెలిచిన చోట ప్రణాళికలు చూపాలని విపక్షాలకు షా హితవు

- మిగతా 2లో




## కాక్రోచ్ పార్టీకి దీపావళి సెలవులు

కాక్రోచ్ జనతా పార్టీ లీడర్లు దీపావళి వరకూ సెలవులు ప్రకటించుకున్నారు. అప్పటి వరకూ ఎలాంటి ఆందోళనలు చేయబోమని దీప్కే ప్రకటించారు. ఈ ప్రకటనలకు కారణం వారి అంతర్గత నిస్సహాయతే ప్రధాన కారణమని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. పార్టీ కీలక నాయకులు దాస్, రాంకా లాంటి వారు ఊహించని విధంగా జైలుపాలు కావడంతో కేడర్‌లో నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింది. అగ్రనేతల వెంటే ఉండి నడిపించాల్సిన ముఖ్యులే కటకటాల వెనక్కి వెళ్లేసరికి, రోడ్డెక్కి వారి కోసం పోరాడే దిక్కులేక శ్రేణులంతా ఎవరికి వారు సర్దుకుపోయి సైలెంట్ అయ్యారు. ఈ సంక్షోభ సమయంలో పార్టీకి అండగా నిలవాల్సిన ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖులు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. నటుడు ప్రకాష్ రాజ్ సైతం వివాదాలకు దూరంగా ఒక వీడియోను విడుదల చేసి, తన వ్యక్తిగత పనుల్లో తాను బిజీ అయిపోయారే తప్ప పార్టీ కోసం క్షేత్రస్థాయిలో గళం విప్పే సాహసం చేయడం లేదు. పండుగ తర్వాత కూడా ఈ కాక్రోచ్‌లను సీరియస్‌గా పట్టించుకునే నాథుడే ఉండరు. ఒకప్పుడు హడావుడి చేసిన ఈ వర్గాన్ని, దేశంలోని జెన్–జీ యువత ఎప్పుడో పక్కనబెట్టి విడాకులు ఇచ్చేసింది. మారుతున్న ట్రెండ్స్, యువత ఆలోచనా విధానానికి తగినట్లుగా మారలేకపోవడంతో ఆ పార్టీ పూర్తిగా ఐసోలేట్ అయిపోయింది. కాక్రోచ్ జనతా పార్టీ ర్గాలన్నీ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అనుబంధ సభ్యులుగా, సానుభూతిపరులుగా మారిపోయారనేది పరిశీలకుల మాట. తాత్కాలిక హంగామాతో సోషల్ మీడియాలో ట్రెండ్ కావచ్చేమో కానీ, గ్రౌండ్ రియాలిటీలో నిలకడ లేని ఇలాంటి రాజకీయ ప్రయోగాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవని మరోసారి రుజువవుతోంది. నాయకుల అరెస్టులు, మద్దతుదారుల వెనుకంజతో కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీపావళి తర్వాత హడావుడి చేద్దామనుకున్న ఆ పార్టీ వ్యూహాలు ఇక పారకపోవచ్చు. ప్రభుత్వం వీరిపై వ్యతిరేకత పెంచడమే కాదు.. ఇదే అదనుగా కఠినంగా వ్యవహరించనుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని వీరి వద్ద బాండ్లు తీసుకుని దాన్నే వారి చేతులు కట్టేయడానికి అవకాశంగా ఉపయోగించుకుంటున్నారు.

**మీరు జెన్ జీనా...**

కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు సంబంధించిన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ధర్మాసనం వారి వయస్సును తెలుసుకున్న తర్వాత ఆ ఇద్దరు నాయకులు 'జెన్ జీ' కిందకు రారని వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా.. పిటిషనర్ల తరఫున హాజరైన లాయర్ అభీక్ చిమ్నీని ఆ ఇద్దరు నాయకుల వయస్సు ఎంత అని జస్టిస్ ప్రసాద్ ప్రశ్నించారు. దాస్‌కి 27 ఏళ్లు, రంకాకి 32 ఏళ్లు అని న్యాయవాది కోర్టుకు తెలిపారు. "అలాగైతే మీరు జెన్ జీ కాదు. ఇంతకీ జెన్ జీ అంటే ఏమిటి?" అని కోర్టు ప్రశ్నించింది. సాధారణంగా 1997 తర్వాత జన్మించిన వారిని 'జెన్ జీ ' అని పిలుస్తారని తెలియజేయగా.. 'అలాంటప్పుడు మీరు జెన్ జీ కారనేది స్పష్టం' అని కోర్టు పునరుద్ఘాటించింది. పిటిషనర్ల జుడీషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగిస్తూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ సంభాషణ సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైంది. ప్రధాని మోదీ ఫోటోను సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కే పోస్ట్ చేస్తూ.. "జెన్ జీ అర్హత ఉన్న ఏకైక వ్యక్తి ఈయనే" అని రాసుకొచ్చారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులను సవాలు చేయడానికి 'రివిజన్' అనే ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో ఉన్నప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని కోర్టు ప్రశ్నించింది. "ఇది మీ రెండో సంఘటన.. మీరు గతంలో పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించారు. మీ అసలు పరిష్కారం రివిజన్ పిటిషన్‌లోనే ఉంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. శాంతి భద్రతల నిబంధనలను రెండోసారి ఉల్లంఘించినప్పుడు కఠినమైన షరతులను విధించే హక్కు అధికారులకు ఉంటుందా లేదా అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. జంతర్ మంతర్‌ను ధర్నా చౌక్‌గా తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, ఆ నోటిఫికేషన్‌పై ఎలాంటి స్టే లేదని కోర్టు గుర్తుచేసింది. అటువంటి పరిస్థితుల్లో పిటిషనర్లు మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లడంపై సందేహం వ్యక్తం చేసింది.

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నవంబర్ 1కి వాయిదా

- మొదటి పేజి తరువాయి

పోలింగ్ జరిగే అవకాశం ఉంది.

ఏపీలోని 100 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాల ప్రకటనను 25వ తేదీ వరకు వాయిదా వేయాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. తొలుత 19 ప్రాంతాల్లోనే ఎన్నికలు ఆపాలని భావించినప్పటికీ.. ఇప్పుడు మొత్తం 100 స్థానాల్లో నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఈసీ వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఈసీ స్పష్టం చేసింది. ఏపీలోని మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైసీపీ పిటిషన్?పై సుప్రీంకోర్టులో విచారణ జరిగిన సంగతి తెలిసిందే. 19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. నామినేషన్ల గడువు వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది.

నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్‌ఈసీని ఆదేశించింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఈనెల 27న నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. 100 చోట్ల ఎన్నికల ప్రక్రియను నిలిపి వేస్తూ.. నవంబర్ 1కి మున్సిపల్ ఎన్నికలను రీషెడ్యూల్ చేస్తూ ఏపీ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

## పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

- మొదటి పేజి తరువాయి

కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు.

# ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు.. షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి. వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది.

అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి

తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏపీకి మరో తుపాను ముప్పు? బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు.

**తుపానుగా మారే అవకాశాలు ఎంత?**

సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్–మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం**

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా

తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు.

ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

# ఎంత వరకైనా పోరాడదాం

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో

పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర

మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ – వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత – అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

# స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన.. ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం. గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా

వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

# డిండికి నీటి తరలింపు ఆపండి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు. సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది. ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

# సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి.. భారతీయుడి సహా ఇద్దరి మృతి

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు దాడులను మరింత తీవ్రతరం చేశారు. బుధవారం రాత్రి దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ సివిల్ ఏవియేషన్ అథారిటీ నేడు ఒక ప్రకటనలో అధికారికంగా ధ్రువీకరించింది. మృతుల్లో ఒకరు సౌదీ పౌరుడు కాగా, మరొకరు భారతీయుడని అధికారులు తెలిపారు. దాడి కారణంగా విమానాశ్రయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు, పౌర మౌలిక సదుపాయాలపై హౌతీల దాడులు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ఈ దాడుల కారణంగా రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయాన్ని మూసివేయడంతో పాటు సౌదీ ప్రభుత్వం ఓ కీలక పెట్టుబడుల సదస్సును కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ నెలలోనే సౌదీ విమానాశ్రయాలపై జరిగిన వివిధ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 22 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలు మారిటైమ్ దిగ్బంధనం విధించడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియా నుంచి వెళ్లే ఆయిల్ షిప్‌మెంట్లకు ఇది పెద్ద ముప్పుగా మారింది.

యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు, ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత జులైలో విఫలమైంది. అప్పటి నుంచి హౌతీలు దాడులను తీవ్రతరం చేశారు.

ఒప్పందం ముగిసిన తర్వాత సౌదీ నౌకలు, భూభాగాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన హౌతీలు, సెప్టెంబర్‌లో భారీ దాడికి దిగి ఎర్ర సముద్ర తీరంలోని పలు ప్రభుత్వ ఆధీన ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి ప్రతిగా హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని పలు ప్రాంతాలపై సౌదీ వైమానిక దళం తరచూ వైమానిక దాడులు జరుపుతోంది. ఈ పరస్పర దాడులతో యెమెన్ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

# అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు.

**10 లీటర్ల నాటుసారా స్వాధీనం ఒక వ్యక్తి పై కేసు నమోదు.**

**కురుపాం అక్టోబర్ 22 పెన్ పవర్.** కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలు నేపద్యంలో భాగంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నాడు దాడులు నిర్వహించగా అనధికారంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నరు.ఈ మేరకు ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ,జియ్యమ్మ వలస మండలం చిన మేరంగి గ్రామంలో దాడులు నిర్వహించగా 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నామని అదే గ్రామానికి చెందిన పట్లసింగి శేఖర్ పై కేసు నమోదు చేసమని తెలిపారు.గ్రామాలలో ఎవరైనా అనధికార మద్యం విక్రయించిన,బెల్ట్ షాపులు నిర్వహించిన ,నాటు సారా తయారీ,రవాణా మరియు అమ్మకాలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ దాడుల్లో కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# బీఆర్టీఎస్ రోడ్డులో ఘోర ప్రమాదం.. ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు

## క్షతగాత్రులను సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటిన హోంమంత్రి అనిత



**విశాఖ తూర్పు పెన్ పవర్:** హనుమంతువాక నుంచి సింహాచలం వెళ్లే బీఆర్టీఎస్ రోడ్డులో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నగరంలోని ఒక ప్రముఖ విద్యాసంస్థలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వచ్చిన వాహనం విద్యార్థినులను ఢీకొట్టడంతో వారు తీవ్ర గాయాలపాలయ్యారు.అదే సమయంలో అటుగా వెళ్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత తన కాన్వాయ్ ని ఆపి, ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను తన వాహనంలోనే సమీప ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ను అదుపులోకి తీసుకోవాలని, ట్రాఫిక్ జంక్షన్లలో బందోబస్తు పెంచాలని పోలీసులను ఆదేశించారు. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా కొమురంభీమ్ జయంతి వేడుకలు

**కొమరంభీమ్ ఆదివాసీలకు చేసిన సేవలు మరువ లేనిది.**

**గిరిజన ఉద్యోగ సంఘాల నేతలు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 22.**ఆదివాసీల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం అసఫ్ జహీ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ యొక్క జయంతి వేడుకలు మండల కేంద్రంలో గల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పార్కు వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొమరంభీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి మండల గిరిజన ఉద్యోగ సంఘాల నేతలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. ఆదివాసి ఉద్యమ నేత భావితరాల ఆదర్శప్రాయుడైన కొమరం భీమ్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కొమరం భీమ్ ఆదివాసీలకు చేసిన సేవలు మరవలేనిదిగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భజంగి బాబురావు,



అంబేద్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షులు కిముడు సూర్యనారాయణ, అంబేద్కర్ ఆశయ సాధన సమితి ప్రధాన కార్యదర్శి మండి అనిల్ కుమార్, ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు ఏంఏం శ్రీను, వైసీపీ నాయకులు చెండా పాపారావు, సింగోయి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు 23 మంది ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు

**మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు కే ధర్మారరావు, త్రినాథనాయుడు.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 22.**మండల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు రెండవ రోజు 23 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. వైసీపీలో 11 మంది, టీడీపీ 3, జనసేనా 3, బిజెపి 2, సిపిఎం1, కాంగ్రెస్ 1, ఇండిపెండెంట్లు 2 నామినేషన్లు దాఖలు చేశారని ఆయన అన్నారు. మొదటి రోజు 12 నామినేషన్లు, రెండవ రోజు 23 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఆయన అన్నారు. మరో రోజు మిగిలి ఉందని ఆయన తెలిపారు. ఏఎస్ఐ లక్ష్మయ్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రెండవరోజు నామినేషన్లు పర్వం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల అసిస్టెంట్ ఎన్నికల అధికారులు కే ధర్మారావు, వి త్రినాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జీకేవీధి జడ్పీటీసీపై జనసేన గురి.. బరిలోకి గొర్లె వీర వెంకట్!



జీకేవీధి జడ్పీటీసీ స్థానం జనసేనకు కేటాయింపు

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండల జడ్పీటీసీ స్థానాన్ని కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించినట్లు కూటమి నాయకులు వెల్లడించారు. ఈ స్థానానికి జనసేన అభ్యర్థిగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ మెంబర్, పాడేరు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త గొర్లె వీర వెంకట్ పేరును ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం పాడేరులో జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి గొర్లె వీర వెంకట్ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ వస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, స్థానిక రాజకీయ పరిణామాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు, అవసరాలపై స్పందిస్తుంటారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.కూటమి సీట్ల సర్దుబాటులో జీకేవీధి జడ్పీటీసీ స్థానం జనసేనకు కేటాయించడంతో మండలంలో జడ్పీటీసీ ఎన్నికల పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారు కావడంతో జనసేన శ్రేణులు ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారించాయి. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండనుందనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# జీకేవీధి మండలంలో రెండో రోజు 51 నామినేషన్లు




**వైసీపీ నుంచి అత్యధికంగా 23.. టీడీపీ నుంచి 11 దాఖలు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22**: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు మొత్తం 51 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. బాబు నాయక్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు.పార్టీల వారీగా నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 23 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం పార్టీ నుంచి 11, సీపీఐ(ఎం) నుంచి 6, జనసేన పార్టీ నుంచి 5, బీజేపీ నుంచి 4, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక నామినేషన్ నమోదైంది. మొత్తం ఆరు పార్టీల నుంచి 51 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో వెల్లడించారు.నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. చివరి రోజు నామినేషన్లతో అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఒకే స్థానం.. ముగ్గురు అభ్యర్థులు!:బి -ఫామ్ ఎవరికి?

**లకవరపుపేటలో కూటమి టికెట్‌పై ఉత్కంఠ**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం లక్కవరపుపేట ఎంపీటీసీ స్థానం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో అభ్యర్థిత్వం ఎవరికి ఖరారవుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.టీడీపీ తరపున కంకిపాటి స్వర్ణలత, బీజేపీ తరపున బోండ్ల తలుపులమ్మ, జనసేన తరపున కుంచెటి సింహాచలం నామినేషన్లు దాఖలు చేశారు. ఒకే ఎంపీటీసీ స్థానానికి కూటమిలోని మూడు పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు వేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.కూటమి తరపున అధికారిక అభ్యర్థిగా ఎవరి పేరును ఖరారు చేస్తారు? ఎవరికి బి-ఫామ్ అందజేస్తారు? మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను కొనసాగిస్తారా? అనే అంశాలపై చర్చ సాగుతోంది. అధికారిక అభ్యర్థిత్వం ఖరారయ్యే వరకు లక్కవరపుపేట ఎంపీటీసీ స్థానం విషయంలో ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.కూటమి నాయకులు ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# ఎన్నికల సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.




- ఎన్నికల వేళ పోలీసుల అప్రమత్తత.చెక్‌పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ.
- గుమ్మలక్ష్మిపురం చెక్‌పోస్టు తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఐపీఎస్

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 22 పెన్ పవర్** .రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,ఐపీఎస్ తెలిపారు.ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి,ఎఫ్ఎస్‌టీ,స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో 24 గంటల నిఘా కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు.ఈ సందర్భంగా గురువారం నాడు గుమ్మలక్ష్మిపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు.ఈ మేరకు ఎల్విన్ పేట సబ్ ఇన్స్పెక్టర్.శివ ప్రసాద్ మాట్లాడుతూ,ఎన్నికల సమయం కావడంతో గుమ్మలక్ష్మీపురం జంక్షన్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ ను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.చెక్‌పోస్ట్ వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని,అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు ఎన్నికల సమయంలో అక్రమ నగదు,మద్యం,ఇతర ప్రలోభపరిచే వస్తువుల రవాణాను అరికట్టేందుకు నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించాలని ఎన్నికల నియమావళి(ఎంసీసీ) అమలులో ఉన్న సమయంలో నిబంధనలను అనుగుణంగా నగదు,ఇతర వస్తువులు తీసుకెళ్ళే వారిదగ్గర వాటికీ తగ్గ అనుమతి పత్రాలును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తనిఖీల సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ప్రతి వాహనాన్ని అప్రమత్తతతో పరిశీలించాలని తెలిపారు.ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తూ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని,ఎన్నికల నియమావళి(ఎంసీసీ) ఉల్లంఘించిన,శాంతిభద్రతలకు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసికోవాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీ వెంట ఎల్విన్పేట ఎస్సై శివప్రసాద్,చెక్ పోస్ట్ సిబ్బందిపాల్గొన్నారు.

## డిగ్రీ మూడో దశ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 30న సీట్ల కేటాయింపు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 22:** డిగ్రీ కళాశాలల్లో మూడో దశ ప్రవేశాలకు ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ షెడ్యూల్ విడుదల చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు నిర్దేశిత గడువులో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 28న వెబ్ ఆప్షన్లలో మార్పులు చేసుకోవచ్చు. అక్టోబర్ 30న సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టనున్నారు.సీట్లు కేటాయించిన విద్యార్థులు అక్టోబర్ 30వ తేదీనే సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు పొందడంతో పాటు తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపల్ సూచించారు. ప్రవేశాల ప్రక్రియపై సందేహాలు ఉన్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరులోని హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

## స్థానిక సంస్థల జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల జిల్లా పరిశీలకులుగా రోణంకి కూర్మనాథ్ ( ఐఏఎస్) నియామకం

- ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాలపై పరిశీలకులను నేరుగా సంప్రదించవచ్చు
- అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వెల్లడి



**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల జిల్లా పరిశీలకులుగా రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ మరియు ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ నియమితులయ్యారనీ,ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఆయన నిన్న అనంతగిరి, అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో పర్యటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారుల సమన్వయం, ఎన్నికల నిబంధనల అమలు తదితర అంశాలను సమీక్షించారనీ,జిల్లా ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ పాడేరులోని పీఎంఆర్సీ అతిథిగృహంలో బస చేస్తున్నారనీ. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు, అంటే 2026 డిసెంబర్ 3వ తేదీ వరకు జిల్లాలో అందుబాటులో ఉంటారనీ.అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు సూచన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు,ప్రజాప్రతిని
ధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు, సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే జిల్లా ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్, (ఐఏఎస్)ను నేరుగా సంప్రదించి తెలియజేయవచ్చనీ,ఇందుకోసం ముందుగా ఆయన క్యాంప్ క్లర్క్ (పర్యటన కార్యాలయ సహాయకుడు) ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకోవాలనీ,ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలకుల దృష్టికి తీసుకువచ్చి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సహకరించాలని, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వర్గాలు విజ్ఞప్తి చేశారు. సంప్రదింపు వివరాలు

జిల్లా ఎన్నికల పరిశీలకులు: రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్
హోదా: రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ మరియు ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్
మొబైల్ నంబర్: 7989108836
క్యాంప్ క్లర్క్ మొబైల్ నంబర్: 7848743786
కలిసే ప్రదేశం: పీఎంఆర్సీ అతిథిగృహం, పాడేరు జిల్లాలో అందుబాటు: 2026 డిసెంబర్ 3వ తేదీ వరకు కలిసే సమయం: ఉదయం 9 గంటలలోపు లేదా సాయంత్రం 6 గంటల తర్వాత మాత్రమేనానీ, ఈ విషయం అందరు గమనించగలరని అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వర్గాలు వెల్లడించారు.

## సిట్టింగ్ ఎంపీటీసీ రీమల రాజేశ్వరి మరోసారి బరిలోకి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని జీకేవీధి ఎంపీటీసీ స్థానానికి ప్రస్తుత ఎంపీటీసీ రీమల రాజేశ్వరి మరోసారి పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా ఆమె గురువారం నామినేషన్ దాఖలు చేశారు.గతంలో ఎంపీటీసీగా పనిచేసిన ఆమెకు బీజేపీ అధిష్టానం మరోసారి అభ్యర్థిత్వం కేటాయించింది. ఈ నేపథ్యంలో జీకేవీధి ఎంపీటీసీ స్థానానికి ఆమె తిరిగి బరిలో నిలిచారు. నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- ఎన్నికల అధికారులకు జిల్లా కలెక్టర్ నిషాంతి టి. ఆదేశాలు
- ఎన్నికల నిర్వహణపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటలకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహణ







**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు (ఆర్ ఓ లు), నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంతి టి. ఆదేశించారు.గురువారం పాడేరు కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్‌ఓలు, నోడల్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి, ఎన్నికల ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై తగిన సూచనలు జారీ చేశారు.

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని,ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లు, క్షేత్రస్థాయి పరిస్థితులు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై నిరంతర సమీక్ష నిర్వహించేందుకు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటలకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు నిర్దేశించిన సమయానికి సమీక్షకు హాజరై, తమ పరిధిలోని ఎన్నికల ఏర్పాట్లపై స్పష్టమైన సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి: ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ ఈ సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల జిల్లా పరిశీలకులు, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ మాట్లాడుతూ... ఎన్నికలు సజావుగానిర్వహించాలంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ గౌరవించి పాటించాలని కోరారు.ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులందరూ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎన్నికల శిక్షణా కార్యక్రమాల్లో వివరించిన అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకుండా ప్రతి దశలోనూ నిబంధనలను పాటిస్తూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తెలిపారు.

నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, సమన్వయం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ఎన్నికల విధులకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణమే పరిష్కరించుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఎన్నికల పరిశీలకులు సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు సబ్ కలెక్టర్ కనాల చిరంజీవి నాగ వెంకట సాహిత్, అదనపు ఎస్పీ శ్రుతి తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఎన్నికల విధులకు సంబంధిత అధికారులు హాజరయ్యారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై జిల్లా పరిశీలకుడి నిఘా

**ఫిర్యాదులు, అభ్యంతరాలుంటే నేరుగా సంప్రదించండి**



**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ నియమితులయ్యారు.ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఆయన అనంతగిరి, అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో పర్యటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారుల సమన్వయం, ఎన్నికల నిబంధనల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

**ఫిర్యాదులకు నేరుగా అవకాశం**

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే జిల్లా ఎన్నికల పరిశీలకుడిని నేరుగా సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకరించాలని సూచించారు.

డిసెంబర్ 3 వరకు పాడేరులో అందుబాటు

జిల్లా ఎన్నికల పరిశీలకుడు రోణంకి కూర్మనాథ్ పాడేరులోని పీఎంఆర్సీ అతిథిగృహంలో అందుబాటులో ఉంటారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు, అంటే 2026 డిసెంబర్ 3వ తేదీ వరకు జిల్లాలో ఉంటారని వెల్లడించారు.ఆయనను కలవాలనుకునే వారు ముందుగా క్యాంప్ క్లర్క్ ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. ఉదయం 9 గంటలలోపు లేదా సాయంత్రం 6 గంటల తర్వాత సంప్రదించవచ్చని సూచించారు.

**సంప్రదింపు వివరాలు:**

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు: రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్
- మొబైల్: 7989108836
- క్యాంప్ క్లర్క్: 7848743786
- కలిసే ప్రదేశం: పీఎంఆర్సీ అతిథిగృహం, పాడేరు
- అందుబాటు: 2026 డిసెంబర్ 3 వరకు అందుబాటు.

## లకవరపుపేట ఎంపీటీసీ అభ్యర్థిగా కంకిపాటి స్వర్ణలత నామినేషన్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం లకవరపుపేట పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి టీడీపీతో కూడిన కూటమి బలపరిచిన అభ్యర్థిగా కంకిపాటి స్వర్ణలత నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజు తొలి నామినేషన్‌గా ఆమె దరఖాస్తు సమర్పించినట్లు తెలిసింది.బీఎస్సీ,స్వర్ణలత ఈ సందర్భంగా మాట్లాడుతూ, లకవరపుపేట పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పంచాయతీ పరిధిలోని 15 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు అవగాహన ఉందని పేర్కొన్నారు. గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన ఉన్న ప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధికి తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు.పాఠశాల విద్య, వ్యవసాయం, పంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పనిచేయాలన్నది తన లక్ష్యమని ఆమె తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె అభిప్రాయపడ్డారు.ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంటోంది.

## దామనపల్లి ఎంపీటీసీ బరిలో మాజీ ఎంపీపీ సతీమణి పెంటమ్మ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు సతీమణి సాగిన పెంటమ్మ పోటీ చేస్తున్నారు. ఈ మేరకు ఆమె గురువారం నామినేషన్ దాఖలు చేశారు. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి బాబు నాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ దాఖలు సమయంలో మాజీ ఎంపీపీ సాగిన బాలరాజుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జీకేవీధి వైసీపీ జడ్పీటీసీ టికెట్‌పై అసంతృప్తి..

ఆరుగురిలో ఒకరికే అవకాశం ఇవ్వాలి!



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 23:** జీకేవీధి జడ్పీటీసీ స్థానానికి వైసీపీ టికెట్‌ను పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ఆరుగురు ఆశావహుల్లో ఎవరికీ కాకుండా ఇతరులకు కేటాయిస్తే రెబల్‌గా పోటీ చేస్తామని వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం జీకేవీధిలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా గిరిప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి టికెట్ కేటాయించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టి, డబ్బులు ఇస్తామనే వారికి టికెట్ కేటాయించాలని చూడటం సరికాదని అభిప్రాయపడ్డారు. డబ్బులతో టికెట్ తెచ్చుకున్న వారికి తాము సహకరించబోమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, సీనియర్ నాయకులు సాంబశివరావు, వంతల చంటిబాబు, కంకిపాటి నారాయణ, మచ్చల మత్యరాజు, కంకిపాటి రామారావు, అరికట్ల అంజి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీలేరు ఎంపీటీసీ బరిలో వైసీపీ అభ్యర్థి ఎం. ప్రియా

మద్దతుగా నిలిచిన వివిధ పార్టీల నాయకులు

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరు ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎం. ప్రియా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.ఎం. ప్రియా నామినేషన్ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరై ఆమెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పద్మనాభం మండలంలో ప్రశాంతంగా ఎంపీటీసీ నామినేషన్లు

**పలు గ్రామాల నుంచి టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు**



**పెన్ పవర్ న్యూస్ 22 అక్టోబర్ -- పద్మనాభం**పద్మనాభం మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకుని తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు.నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఎం. చంద్రమౌళి, ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. దీంతో పద్మనాభం మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి నెలకొంది.

## ఆనందపురం-1 ఎంపీటీసీకి జనసేన తరపున రామలక్ష్మి నామినేషన్



**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబరు 22:**ఆనందపురం-1 ఎంపీటీసీ స్థానానికి జనసేన అభ్యర్థిగా కుప్ప రామలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. జై జవాన్ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆమె స్థానికంగా గుర్తింపు పొందారు. ఎనిమిదేళ్లుగా జనసేనలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు అనాథ పిల్లలు, వృద్ధులకు భోజన వసతి కల్పిస్తున్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం, చదువుకు ఆర్థిక సాయం అందించడం, ఆపదలో ఉన్న నిరుపేదలకు చేయూతనివ్వడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదులో 420 సభ్యత్వాలు చేయించి మండలంలో ప్రథమ, భీమిలి నియోజకవర్గంలో ఐదో స్థానంలో నిలిచినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నామినేషన్ కార్యక్రమానికి సుమారు 200 మంది హాజరయ్యారు. కూటమి తరపున బీఫారం దక్కుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## జీకేవీధి వైసీపీ జడ్పీటీసీ టికెట్‌పై సస్పెన్స్..

**ఆశావహుల్లో టెన్షన్! కంకిపాటి గిరిప్రసాద్ కు కేటాయించే అవకాశం?**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22**: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై సందిగ్ధత కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో పార్టీ అభ్యర్థి ఎవరనే అంశంపై వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆశావహుల మధ్య పోటీ పెరగడంతో అధిష్టానం నిర్ణయంపై ఆసక్తి వ్యక్తమవుతోంది.

**ఆశావహుల మధ్య తీవ్ర పోటీ:**

జీకేవీధి జడ్పీటీసీ స్థానానికి పార్టీ తరపున పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని మండలానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు కోరుతున్నట్లు సమాచారం. మాజీ ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు సీనియర్ నాయకులు టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల పార్టీలో చేరిన ఓ రిటైర్డ్ ఉద్యోగి, మాజీ మంత్రి కుటుంబానికి చెందిన వ్యక్తి పేరు కూడా ఆశావహుల చర్చలో వినిపిస్తున్నట్లు స్థానికంగా ఊహాగానాలు సాగుతున్నాయి.

**చివరి రోజు అభ్యర్థి ఎవరనేది కీలకం:**

నామినేషన్ల ప్రక్రియలో ఇప్పటికే రెండు రోజులు పూర్తికాగా, చివరి రోజైన అక్టోబర్ 23న వైసీపీ తరపున ఎవరు నామినేషన్ దాఖలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్‌కు జడ్పీటీసీ అభ్యర్థిత్వం దక్కే అవకాశం ఉందంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు అభ్యర్థి ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. టికెట్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠకు చివరి రోజు తెరపడుతుందా? ఆశావహుల్లో ఎవరికి పార్టీ అధిష్టానం అవకాశం కల్పిస్తుంది? అనే అంశాలు ప్రస్తుతం గూడెంకొత్తవీధి మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ఆనందపురం జెడ్పీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా బాలి రాంబాబు నాయుడు నామినేషన్

**తర్లువాడ మాజీ సర్పంచ్, ఎంపీటీసీగా అనుభవం.. జెడ్పీటీసీ బరిలోకి**



**ఆనందపురం, పెన్ పవర్ అక్టోబర్ 22** :విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండల జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బాలి రాంబాబు నాయుడు నామినేషన్ దాఖలు చేశారు. తర్లువాడ గ్రామానికి చెందిన ఆయన గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించారు. గ్రామస్థాయి పాలనలో అనుభవం కలిగిన ఆయన ప్రస్తుతం జెడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలిచారు. బాలి రాంబాబు నాయుడు (48) తండ్రి సత్యనారాయణ. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆయన బీఏ వరకు విద్యాభ్యాసం పూర్తి చేశారు. తర్లువాడ గ్రామంలో నివాసం ఉంటున్న ఆయనకు స్థానిక రాజకీయాలపై అవగాహన ఉంది. గతంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేసిన అనుభవంతో జెడ్పీటీసీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆయన నామినేషన్‌తో ఆనందపురం మండలంలో జెడ్పీటీసీ ఎన్నికల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి.

## బారి జనసమూహంతో వైసీపీ జెడ్పీ టీసీ అభ్యర్థి రాంబాబు నామినేషన్

**పాడేరులో రాజకీయ రసవత్తరం!**



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 22** :బారి జనసమూహంతో వైసీపీ బలపరిచిన జెడ్పీ టీసీ అభ్యర్థి రాంబాబు పాడేరు మండల జడ్పీటీసీ స్థానానికి జన కోలాహలం మధ్య మద్దతు దారులతో వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు. పాడేరు మండలం డి.గొందూరు పంచాయితీ, డి గొందూరు గ్రామానికి చెందిన సీదరి రాంబాబు గతంలో పంచాయతీ సర్పంచుగా 2 పర్యాయాలు అఖండ విజయం సాధించి ప్రజాదరణ పొందిన వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది అంతే కాదు వైసీపీ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ నీ నమ్ముకొని ఉన్నారు.అంతే కాదు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు కువీర విధేయుడు పాడేరు మండల పార్టీ అధ్యక్షుడు గా ఉండి తన దైన శైలిలో ముద్ర వేసుకోని రాజకీయ ముద్ర వేసుకున్న వ్యక్తి. తన సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా జెడ్పీ టీసీ అభ్యర్థిగా ముందుగానే ప్రకటించారు. ఎవరు కూడా ఎదురు తిరగని పరిస్థితి.. గురువారం ముందుగా మొదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు చేతుల మీదుగా పార్టీ బీ-ఫారం స్వీకరించి అక్కడి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా ఐటీడీఏకి చేరుకున్నారు. అనంతరం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. మండలానికి చెందిన పలువురు వైసీపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో సాగిన ఈ ర్యాలీలో సీదరి రాంబాబుకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వైసీపీ నినాదాలతో పరిసరాలు మారుమోగగా, పార్టీ శ్రేణులు విజయమే లక్ష్యంగా ఉత్సాహంగా ముందుకు సాగాయి. నామినేషన్ అనంతరం మీడియాతో సీదరి రాంబాబు మాట్లాడుతూ... గతంలో డి గొందూరు పంచాయతీ ప్రజలు నాను ఆదరించి 2 పర్యాయాలు సర్పంచ్ గా గెలిపించి ఆదరించినట్లు ఈ పర్యాయం పాడేరు మండల ప్రజలు నాను ఆదరించి జెడ్పీ టీసీ గా గెలిపిస్తే మండల ప్రజలకు సేవా చేసే భాగ్యం కలుగుతుందని అన్నారు.

## ఆపదలో ఉన్న ఫోటోగ్రాఫర్‌కు కళా సేవా పీఠం అండ

- **విశ్వేశ్వరరావుకు రూ.20 వేల ఆర్థిక సాయం**
- **మానవత్వమే నిజమైన సేవ**
- **కష్టకాలంలో ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత**
- **కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 22 :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, మానవతా విలువలను చాటుకోవడమే లక్ష్యంగా గోపాలపట్నం కళా సేవా పీఠం మరో సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య పరీక్షలు, మందుల ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫోటోగ్రాఫర్ ఏ. విశ్వేశ్వరరావుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోని సింహాచలం శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటున్న ఫోటోగ్రాఫర్ ఏ. విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు మందులు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఆర్థిక వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు స్పందించారు. ఆయనకు అవసరమైన సమయంలో తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు తమకు చేతనైనంత సహాయం అందించడం ద్వారా వారి కష్టాలను కొంతవరకైనా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవడం ఎంతో అవసరమని అన్నారు. సేవా కార్యక్రమాలు కేవలం ఆర్థిక సహాయానికే పరిమితం కాకుండా, సమాజంలో పరస్పర సహకారం, మానవత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో అందించే చిన్న సహాయం కూడా బాధితులకు ఎంతో ధైర్యాన్ని, మనోబలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరంగా ఉన్నవారు తమకు వీలైనంత మేరకు అవసరంలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని నందవరపు సోములు కోరారు. ఈ కార్యక్రమంలో కళా సేవా పీఠం గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు గోరకల రామదాసు, మాజీ గౌరవ అధ్యక్షుడు తాండ్రంగి రామారావు, ఎం.ఎన్.వి. శ్రీనివాస్, కొమ్మాది వెంకట్రావు, ఎన్.వి. నరసింహం, ముదపాక శివ సత్యనారాయణ, సన్నెల శివకుమార్, పెదిరెడ్ల ప్రసాద్, కంపర కనకరాజు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించిన కళా సేవా పీఠం సభ్యులను పలువురు అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.



# దుర్గమ్మ విగ్రహ దాతలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 22.** దసరా ఉత్సవాలకు, ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహదాత ముత్తా శ్రీనివాసరావు నాగరత్నం దంపతులకు గురువారం గ్రామ పెద్దలు పసుపులేటి వినాయకరావు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సాయం సత్యనారాయణ బండారు నాయుడు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినాయకరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది రంగా సెంటర్లో దసరా ఉత్సవాలు నిర్వహించడం చాలా సంతోషకరమని గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం గ్రామానికి మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు చేసిన తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వినాయక తెలిపారు. ఈ సందర్భంగా రంగా సెంటర్లో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తదనంతరం అమ్మవారి అణుపు కార్యక్రమం భారీ ఊరేగింపు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హంసరాజు లోవ మహిళలు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు గెలిపిస్తే గిరిజన హక్కుల సాధనకు కృషి చేస్తాం.

- **రెండు ఎంపీటీసీ స్థానాలకు సీపీఎం అభ్యర్థుల నామినేషన్లు**
- **బూర్జ నుంచి కొర్రా అరుణ, హుకుంపేట నుంచి పాంగి లింగమూర్తి**



**హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 22** : అల్లూరి సీతారామ జిల్లా అరకు నియోజకవర్గం. హుకుంపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సీపీఎం తరఫున తొలి విడతగా రెండు ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు పార్టీ మండల కార్యదర్శి వి. లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బూర్జ ఎంపీటీసీ స్థానానికి కొర్రా అరుణ, హుకుంపేట ఎంపీటీసీ స్థానానికి పాంగి లింగమూర్తి నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సీపీఎం అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ప్రధానంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని, ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా పోరాటాల ఫలితంగానే ప్రాజెక్టు నిర్మాణం తాత్కాలికంగా నిలిచిందని పేర్కొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు విషయంలో కూటమి, వైసీపీ ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంతో ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసీ గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల భూములు, గ్రామాలు, సహజ వనరులను కాపాడేందుకు ప్రజలు సీపీఎం అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని శాశ్వతంగా నిలిపివేసేందుకు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని లక్ష్మణరావు హామీ ఇచ్చారు.నామినేషన్ల కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు డి. కృష్ణమూర్తి, గిరిజన సంఘం కార్యదర్శి టి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో జోరుగా కోడిపందాలు....

- **నిర్వాహకుడు లక్షలో బెట్టింగులు ప్రోత్సాహం**
- **ఎన్నికల హడావిడిలో పోలీసులు**



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోకోడి పందాలు నిర్వహిస్తున వ్యక్తి లక్షల రూపాయల్లో బెట్టింగులు కాపిస్తూ జోరుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో పోలీసులు బిజీగా బందోబస్తు హడావిడిలో నిమగ్నంగా ఉండడాని ఆసరాగా తీసుకున్న పందెం రాయుళ్లు చట్టాన్ని తమ సుట్టంగా మలచుకుని, చట్టానికి విరుద్ధంగా కాఖిల కళ్ళు కప్పి డేగ పందేలు నిర్వహిస్తున్న ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, గుత్తుల పుట్టు పంచాయతీ, కొత్తపల్లి గ్రామ సమీపంలో బహిర్గతంగానే ఆట విడుపు చోటు చేసుకుంది..లక్షల రూపాయల బెట్టింగ్ కాస్తూ, జోరుగా కోడి పందాలు కొనసాగుతుండడం గమనార్హం. గుత్తులుపుట్టు గ్రామం జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఉంది కానీ ఎటువంటి అదురు బెదురు లేకుండా, కోడిపందాలు, చిత్తులాటలు, పేకాట కార్యక్రమాలకు ఈ ప్రాంతం నిలువు నీడల కేంద్ర బిందుగా ఏర్పాటు చేసుకునీ ఆట సాగిస్తున్నారు. పలు మార్లు పోలీసులు హడావిడి చేసిన... ఎటువంటి స్పందన లేకుండా పోయింది. అంటే నిర్వాహకులకు పోలీసులకు కొమ్ము కాస్తున్నారా...? అనే అనుమానాలు బలంగా వినిపిస్తూనాయి. ఇదే అంశం పై గతంలో పోలీసులకు సమాచారం ఇచ్చిన హడావిడి తప్ప ఎవరికి చర్యలు తీసుకొన్న దాఖలు మాత్రం లేకే మళ్ళీ ఎన్నిలక హడావిడిలో పోలీసులు బిజీగా బందోబస్తు లో ఉండడం చూసి ఈ జూదం ఆడానికి సిద్ధం అయినట్లు తెలుస్తుంది... కాగా పోలీసులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిన ఉంది...

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పలుచోట్ల వారోత్సవాలు**

**అమరవీరుల వారోత్సవాల హోర్డింగుల ఏర్పాటు**

**పోలీసు అమరవీరులకు నివాళులర్పించిన ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 22 :** శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని గోపాలపట్నం ఎస్ఐ సూరిబాబు అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో అమరవీరుల వారోత్సవాల హోర్డింగులను ఏర్పాటు చేశారు. గోపాలపట్నం, పెందుర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బాజీ జంక్షన్, పెట్రోల్ బంక్ జంక్షన్, గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓల్డ్ గోశాల జంక్షన్, ఓసీహెచ్ జంక్షన్, పెందుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద, పెందుర్తి జంక్షన్‌తో పాటు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో ఈ హోర్డింగులను ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలకు గుర్తుచేసేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలపట్నం ఎస్ఐ సూరిబాబు మాట్లాడుతూ, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యమిచ్చే పోలీసు సిబ్బందిలో కొందరు తమ ప్రాణాలను సైతం త్యాగం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారు చూపిన సేవాభావం, ధైర్యం, అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం నిస్వార్థంగా ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తన సిబ్బందితో కలిసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటిస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సేవలను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే సంస్మరణ కార్యక్రమాలు పోలీసుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా రక్షణలో పోలీసుల పాత్రను గుర్తుచేస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.




## జీకేవీధి జడ్పీటీసీపై జనసేన గురి.. బరిలోకి గొర్లె వీర వెంకట్!

**జీకేవీధి జడ్పీటీసీ స్థానం జనసేనకు కేటాయింపు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండల జడ్పీటీసీ స్థానాన్ని కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించినట్లు కూటమి నాయకులు వెల్లడించారు. ఈ స్థానానికి జనసేన అభ్యర్థిగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ మెంబర్, పాడేరు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త గొర్లె వీర వెంకట్ పేరును ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం పాడేరులో జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి గొర్లె వీర వెంకట్ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ వస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, స్థానిక రాజకీయ పరిణామాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు, అవసరాలపై స్పందిస్తుంటారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కూటమి సీట్ల సర్దుబాటులో జీకేవీధి జడ్పీటీసీ స్థానం జనసేనకు కేటాయించడంతో మండలంలో జడ్పీటీసీ ఎన్నికల పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారు కావడంతో జనసేన శ్రేణులు ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారించాయి. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండనుందనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## రింతాడ చేలకవీధిలో ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు

- ఆదివాసీ హక్కులు, స్వయం పాలన సాధనకు ఐక్యంగా పోరాడాలి




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ చేలకవీధి గ్రామంలో ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ ఆదివాసీ స్వయం పాలన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, కొమురం భీం ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలనకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. నిజాం పాలనలో ఆదివాసీల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. 'జల్--జంగల్--జమీన్' (నీరు--అడవి--భూమి) నినాదంతో ఆదివాసీ సమాజంలో చైతన్యం నింపారని తెలిపారు. కొమురం భీం పోరాట స్ఫూర్తిని నేటి ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, ఆదివాసీ హక్కుల పరిరక్షణ, స్వయం పాలన సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కొమురం భీం ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే ఆదివాసీ సమాజ సమగ్ర అభివృద్ధికి బాటలు పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొని కొమురం భీంకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'కొమురం భీం అమర్ హై' అంటూ నినాదాలు చేస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## మీడియాపై ఆంక్షలు విధించడం సరికాదు.

**కురుపాం ఎన్నికల అధికారుల తీరుపై సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు ఆగ్రహం**




**కురుపాం అక్టోబర్ 22 పెన్ పవర్..** స్థానిక ఎన్నికల నేపథ్యంలో కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మీడియాపై అధిక ఆంక్షలు విధిస్తున్నారని, కనీసం మీడియా ప్రతినిధులను కార్యాలయంలోకి అనుమతించకపోవడం సరికాదని గురువారం నాడు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు కురుపాం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో, జిల్లాలోని పలు చోట్ల మీడియా ప్రతినిధులను అనుమతిస్తూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఫొటోలు తీసేందుకు అవకాశం కల్పిస్తున్నారని అయితే కురుపాంలో మాత్రం మీడియాపై ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని గంగునాయుడు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాకు స్వేచ్ఛగా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే విషయంలో అడ్డంకులు సృష్టించరాదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో మీడియా ప్రతినిధులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియాపై విధిస్తున్న ఆంక్షలను వెంటనే తొలగించాలని సీపీఎం పార్టీ తరపున కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

# దామనపల్లి వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా సాగిన సత్యవతి నామినేషన్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సాగిన సత్యవతి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. గూడెంకొత్తవీధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, దామనపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షుడు సాగిన సత్తిబాబు, సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు సీందేరి కర్రయ్య, వాలంటీర్ విభాగం అధ్యక్షుడు సాగిన శ్రీను, దుక్కెరి చందు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని 11 మండలాలకు సంబంధించిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రశాంతంగా రెండవ రోజు జడ్పీటీసీ నామినేషన్లు, ఈ ప్రక్రియలో 40 నామినేషన్లు దాఖలు.

**పాడేరు పెన్ పవర్: అక్టోబర్ 22 :** 2వ స్థానిక సంస్థల ఎన్నికలు జడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ అభ్యర్థుల నుండి స్వీకరించారు. గురువారం స్థానిక ఐటిడిఏ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన జడ్పిటిసి నామినేషన్ పత్రాలను వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధించి మొత్తం 40 మంది వారి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. వారి నుండి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి స్వీకరించారు. విరుజిల్లాలోని చింతపల్లి-5, జీకే వీధి-3, కొయ్యూరు-4, జి మాడుగుల-4, పాడేరు-5, డుంబ్రిగుడ-3, అరకు వ్యాలీ-6, ముంచంగిపుట్టు-3, హుకుంపేట-5, అనంతగిరి -2 మండలాల నుండి అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసుకున్నారు. ఈ నామినేషన్ ప్రక్రియలో సహాయ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (పివిటిజి)ఏం. వెంకటేశ్వరావు, జిల్లాపరిషత్ ఏఓ సతీష్, ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# యల్లపువానిపాలెంలో పెప్సీ రమణ ఎన్నికల ప్రచారం



**73వ వార్డులో ఇంటింటి ప్రచారం.. స్థానికులతో అభ్యర్థి మమేకం**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 22 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 73వ వార్డులో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి పెప్సీ రమణ యల్లపువానిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకున్నారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడి వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పలుచోట్ల మహిళలు హారతులతో స్వాగతం పలికినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. వార్డులో రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలు స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేసే ప్రజాప్రతినిధి కావాలని స్థానికులు ఆశిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ప్రజలను కలుసుకోవడం, తమ అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకోవడం ద్వారా మద్దతు కోరుతున్నారు. ఎన్నికల అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి పనుల పురోగతి వంటి అంశాలు ప్రజాప్రతినిధుల పనితీరుకు కీలకం కానున్నాయి. యల్లపువానిపాలెంలో పెప్సీ రమణ నిర్వహించిన ఇంటింటి ప్రచారంతో 73వ వార్డులో ఎన్నికల సందడి నెలకొంది.

## ఆత్రేయపురం జడ్పీటీసీ అభ్యర్థిగా కప్పల శ్రీధర్ నామినేషన్

**అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల సమర్పణ**



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 22:** ఆత్రేయపురం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కప్పల శ్రీధర్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అమలాపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో తన భార్య స్వరూపతో కలిసి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు మద్దతుగా హాజరయ్యారు.కప్పల శ్రీధర్ నామినేషన్ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొల్లపల్లి దేవుడు రాజు, ఆత్రేయపురం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాస్ రాజు, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దింటి వేణుగోపాల్, నెల్లి లక్ష్మీపతి, సీనియర్ నాయకుడు కొల్లి శ్యాం, నార్కెడమెల్లి మాజీ సర్పంచ్, న్యాయవాది పాల నాగేశ్వరరావు, చంటి, ఇసుకపట్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కప్పల శ్రీధర్ నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమంతో ఆత్రేయపురం మండలంలో జడ్పీటీసీ ఎన్నికల రాజకీయ సందడి నెలకొంది.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.1,01,116 విరాళం

**అష్టోత్తర పూజల్లో పాల్గొన్న హైదరాబాద్ భక్తులు.. దాతలకు అర్చకుల ఆశీర్వచనం**



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 22:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గురువారం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరానికి చెందిన తమ్మన శ్రవణ్--గాయత్రి దంపతులు, వారి కుమారుడు చిరంజీవి కుషాల్ సూర్యతో పాటు కుటుంబ సభ్యులు వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న వారు ఆలయానికి విరాళం అందజేశారు.విరాళం సమర్పించిన దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వచనాలు అందించారు.వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుండటంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆలయానికి విరాళాలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

## జగ్గంపేట టిడిపి జడ్పీటీసీ అభ్యర్థిగా జీను మణిబాబు నామినేషన్



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 22 :** జగ్గంపేట జడ్పీటీసీ స్థానానికి కూటమి పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీను మణిబాబు నామినేషన్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ముందుగా జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ అమ్మవారికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ జన సందోహంతో కాకినాడ బయలుదేరి వెళ్లి జిల్లా పరిషత్ భవనంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై మణిబాబుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో అవకాశం కల్పించిన జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. జగ్గంపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజా సేవలో ఉంటానని హామీ ఇచ్చారు.

## శ్రీశారద రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యం లో ఘనంగా ముగిసిన ఉత్సవాలు





**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 22:** పెద్దబ్రహ్మ దేవం లో గల శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ముగిసాయి. ఉదయం ఏకవార రుద్రాభిషేకం కుంకుమార్చన నీరాజన మంత్రపుష్పం పూజలతో పూజ కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిసాయి.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ,నువ్వుల వెంకటరాజు,నువ్వుల బాబ్జీ, తెలుగుంట్ల నరసింహారావు,తోట రమణ, కె.వెంకటేశ్వరావు, నువ్వుల సూర్య చంద్రరావు,మహిళలు తదితరులు పాల్గొన్నారు

## నవంబర్ 6లోగా జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి




**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 22:**జలజీవన్ మిషన్ కింద కాకినాడ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 88 వాటర్‌గ్రిడ్ పనులను నవంబర్ 6వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ వారాంతపు సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు.80 గ్రామాల్లో కుళాయి కనెక్షన్ల పనులు పూర్తి చేయాలి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కల్పనలో భాగంగా స్వల్ప సంఖ్యలో కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్న 80 గ్రామాల్లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా గ్రామాలను 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు.తాగునీటి సరఫరా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.గ్రామీణ నీటి సరఫరా,పారిశుధ్యానికి ప్రాధాన్యం సింగిల్ విలేజ్ స్కీమ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలను మెరుగు పరచడంతో పాటు పారిశుధ్య ప్రమాణాలనుపెంపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రతి పనికి సంబంధించిన పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెం డెంట్ మహమ్మద్ అబ్దుల్ మదిన్, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఏపీఈపీడీసీఎల్, అటవీ శాఖ, డ్వామా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా నామినేషన్ వేసిన ధరణాలకోట శ్రీను.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్ 22:** ప్రత్తిపాడు మండలం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం జడ్పిటిసిగా ప్రజలు తనకు అవకాశం ఇస్తే జిల్లా పరిషత్ నుండి నిధులు తీసుకువచ్చి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలియజేసారు.నామినేషన్ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ ఉమ్మిడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా సంగ్రామానికి సిద్ధం



**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 22:** స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు అమలాపురం రూరల్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు చెప్పాం చేస్తున్నాం అనే నినాదంతో గడిచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల సంగ్రామానికి వెళు_న్నామని అన్నారు. ముఖ్యంగా కూటమి పార్టీలు ఎన్నికలకు వెళ్ళినప్పుడు ఆయా పార్టీల్లో కష్టపడుతూ సేవా దృక్పథంతో పనిచేస్తూ ప్రజల్లో మంచి పేరున్న నాయకులకు కూడా రిజర్వేషన్ల ప్రక్రియ వల్ల కొన్ని సీట్లు కూటమి పార్టీల వల్ల కొన్ని సీట్లు త్యాగం చేయవలసి వచ్చిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని విధాల సహకరించిన జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ కు నాయకులకు బిజెపి నాయకులకు టిడిపి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 80 ఎంపీటీసీ స్థానాలకు గాను జనసేనకు 15 బిజెపికి 2 తెలుగుదేశం పార్టీ 63 స్థానాల్లో అభ్యర్థులను పోటీ చేయించడం జరుగుతుందని అదేవిధంగా నియోజకవర్గంలోని 4 జడ్పిటిసి స్థానాలకు గాను మూడు జడ్పిటిసి స్థానాలు టిడిపికి 1 జడ్పిటిసి గండేపల్లి జనసేనకు కేటాయించడం జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు వచ్చినప్పుడు పార్టీలు తమ సత్తాను నిలబెట్టుకోవడానికి పోటీ చేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కావాలని కానీ జగన్ ప్రజల్లో ఇమేజ్ లేక స్థానిక సంస్థల ఎన్నికలను ఏదో విధంగా నిలుపుదల చేయాలని ప్రయత్నిస్తున్నారని దానికి కోర్టులకు వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో స్థానిక సంస్థలను ఏ విధంగా నిర్వహించారో ప్రజలకు తెలిసిందని స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే కేంద్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ప్రకారం గ్రామాలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తుందని గ్రామాలు అభివృద్ధి చెందడం జగన్మోహన్రెడ్డికి ఇష్టం లేకనే ఇలా చేస్తున్నారని అన్నారు.

## ముద్రగడ గిరిబాబు సమక్షంలో వైసీపీలోకి భారీ చేరికలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 22:**కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో భారీ చేరికలు జరిగాయి. భద్రవరం గ్రామ వైసీపీ అధ్యక్షులు బందిల అంకాలు, మాజీ సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, ఎంపీటీసీ అభ్యర్థి కాకర రాంబాబు, ఇసుకనాపల్లి బుజ్జిల ఆధ్వర్యంలో భద్రవరం గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

## వైభవంగా ఊంజల్ సేవ



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 22:**ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని గురువారం చింతలూరు నిత్య వైకుంఠ ద్వార శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, సేవలను తిలకించి, గోవిందనామ స్మరణలో తన్మయత్వాన్ని పొందారు.

# పెద్ద అడ్డపల్లిలో వైభవంగా అమ్మవారి ఊరేగింపు



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 22:**గంగవరం మండలం పెద్ద అడ్డపల్లి గ్రామంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ఊరేగించారు. గ్రామంలో భక్తి పారవశ్యం నడుమ నిర్వహించిన ఈ ఊరేగింపులో గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద అడ్డపల్లి గ్రామం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు గంగవరం చిన్న అడ్డపల్లి, ఏటి పల్లి గ్రామాల మీదుగా సాగింది. అనంతరం పైడిపుట్ట వాగులో అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఊరేగింపు మార్గంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ సందర్భంగా గ్రామ బాలికలు, మహిళలు అమ్మవారి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ దుస్తులు, అమ్మవారి అలంకరణలతో వారు ప్రదర్శించిన వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పండుగ వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు, విగ్రహ నిమజ్జన కార్యక్రమం భక్తుల ఉత్సాహం మధ్య ప్రశాంతంగా ముగిసింది.

## షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టాన్ని, గ్రామసభల్ని అమలు చేయాలి

### ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 22:** రాష్ట్ర విభజన చట్టంలో 5వ షెడ్యూల్డు లో పోలవరం ముంపు నిర్వాసితుల పట్ల ఐఏయస్ అధికారులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తు న్నారని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ విమర్శించారు. పోలవరం నిర్వాసితుల్లో ఎస్టీలకు 15 లక్షల రూపాయల ప్యాకేజీ చెల్లించాలని, చట్ట ప్రకారం భూమిలేని ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి కనీసం ఎకరం భూమి కేటాయించాలని, ఎకరానికి 45 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన పారా సంస్థ డైరెక్టర్ ధామస్ పల్లిధానం, ఆదివాసీ నాయకులతో కలిసి శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టాన్ని ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని, గ్రామ సభలు నిర్వహించడం లేదని విమర్శించారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్., వి.యస్.యస్. ఇతర భూములకు పరిహారం చెల్లించాలని, 18 సం. దాటిన వారికి ప్యాకేజీ, ఇళ్లకు, చెట్లకు పరిహారంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీలు జోక్యం చేసుకోవాలని పోలవరం నిర్వాసిత దళిత ఆదివాసీ మహిళా సంఘం, ఆదివాసీ మహాసభ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు..ఆంధ్రప్రదేశ్ ఐఏయస్ అధికారులు శంకరన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అక్టోబర్ 22న శంకరన్ 93వ జయంతి నుంచి భారత రాజ్యాంగ సభ సభ్యుడు జైపాల్ సింగ్ ముండా జయంతి జనవరి 3వ తేదీ వరకు పోలవరం నిర్వాసితుల హక్కుల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు సూర్యనారాయణ తెలిపారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్డీవోల నుంచి కులధృవీకరణ పత్రాలు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే మండల తహశిల్దార్లు ఇచ్చే కుల ధృవీకరణ పత్రాలతో నామినేషన్లు వేయడం చెల్లుబాటు కాదన్నారు. పి ధామస్ మాట్లాడుతూ శంకరన్ ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. 13 కోట్ల ఓట్లను తొలగించారని, శంకరన్ స్ఫూర్తితో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసీ మహాసభ నాయకులు నల్లా సూర్య ప్రకాష్, మిడియం వెంకటేష్, గిన్నెపు వెంకటరెడ్డి, మిడియం వెంకట స్వామి, అన్నిక బాపనమ్మ, అరగటి వీరభద్రారెడ్డి, జక్కల పాండవులు, బత్తిన పుష్ప, జీడెం నాగేశ్వరరావు, జర్తా వరలక్ష్మి, ఏకలవ్య చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు సింహ రాయల్, సామాజిక సేవకుడు అమీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా డీఆర్ఓగా ఆర్. శివరావు

### కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లతో మర్యాదపూర్వక భేటీ



**రంపచోడవరం ,(పోలవరం బ్యూరో), పెన్ పవర్, అక్టోబర్ 22:**పోలవరం నూతన జిల్లా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్ఓ)గా బాధ్యతలు చేపట్టిన ఆర్. శివరావు గురువారం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలో పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలనలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం డీఆర్ఓ ఆర్. శివరావు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ పరిపాలన, ప్రజలకు అందించాల్సిన సేవలు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారుల మధ్య అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

## ఉంగుటూరులో కోలాహలంగా నామినేషన్ల పర్వం





**పెన్ పవర్ ఉంగుటూరు అక్టోబర్ 22**
రెండో రోజు పోటెత్తిన అభ్యర్థులు.. మధ్యాహ్నానికే 45 నామినేషన్లు దాఖలు
ఉంగుటూరు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ గురువారం కోలాహలంగా సాగింది. కూటమి, వైకాపా నాయకులు, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మండల పరిషత్ కార్యాలయం అభ్యర్థులతో కిటకిటలాడింది. మధ్యాహ్నానికే మొత్తం 45 నామినేషన్లు దాఖలయ్యాయి.
నామినేషన్ల దాఖలు ప్రక్రియలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నామినేషన్ పత్రాల పూర్తి, ఓటర్ల జాబితాలో పేర్ల పరిశీలన కోసం ఏడు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎస్. రామమోహనరావు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్, తహసీల్దార్ ఎం. సన్యాసిరావు పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు చేపట్టారు. పంచాయతీ అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు అభ్యర్థులకు సహకరించారు. మరోవైపు కూటమి, వైకాపా నాయకులు తమ అభ్యర్థులతో కలిసి భారీ ఊరేగింపులు, ప్రదర్శనలతో నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 200 మీటర్ల దూరంలోనే ఊరేగింపులను నిలిపివేశారు.
చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.1,01,116 విరాళం



**అష్టోత్తర పూజల్లో పాల్గొన్న హైదరాబాద్ భక్తులు.. దాతలకు అర్చకుల ఆశీర్వచనం**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 22:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గురువారం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరానికి చెందిన తమ్మన శ్రవణ్--గాయత్రి దంపతులు, వారి కుమారుడు చిరంజీవి కుషాల్ సూర్యతో పాటు కుటుంబ సభ్యులు వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి రూ. 1,01,116 విరాళంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న వారు ఆలయానికి విరాళం అందజేశారు.
విరాళం సమర్పించిన దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వచనాలు అందించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుండటంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆలయానికి విరాళాలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 22:**దేశం లో హిందూ మత సంస్కృతి, సంప్రదాయా లకు కీర్తి ప్రతిష్ఠతలకు కృషి చేసిన హిందూ ధర్మ పరిరక్ష కుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ను ఈ నెల 25వ తేదీన కంబాల చెరువు వద్ద సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ వేడుకను రాజకీయాలకు అతీతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహారాష్ట్ర నుంచి జ్యోతి తీసుకొచ్చి విగ్రహావిష్కరణన్ని వైభవంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు దేశ చరిత్ర లో విశిష్టమైన స్థానం ఉందని, ఆయన ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు, పరిపాలనా దక్షత, ప్రజల పట్ల చూపిన బాధ్యతలు నేటి తరానికి స్ఫూర్తిదా యకమన్నారు. శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తి యువతకు తెలియజేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నగరంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం ద్వారా చారిత్రక వ్యక్తుల త్యాగాలు, ఆశయాలు ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహారాష్ట్ర నుంచి ప్రత్యేక జ్యోతి మహారాష్ట్ర నుంచి జ్యోతిని తీసుకొచ్చి ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పతివాడ రామరాజు వెల్లడించారు. . రాజకీయాలకు అతీతంగా నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ రహిత తాగునీటి సరఫరా

### రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ఆర్. కృష్ణయ్య



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 22:**రానున్న గోదావరి పుష్కరాలకు భక్తులకు ప్లాస్టిక్ రహిత స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కార్యాచరణ రూపొందిం చాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ఆర్. కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి అధికారులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమల ప్రతినిధులతో పుష్కరాల తాగునీటి సరఫరా, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. పుష్కర భక్తులకు తాగునీటి వసతుల కల్పనకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ వివరించారు. పుష్కరాల రద్దీ రోజుల్లో జిల్లాకు సుమారు 80 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పుష్కర నగరాలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో వాటర్ పాయింట్లు, వాటర్ ఏటీఎంలు ఏర్పాటు, ప్రధాన నడక మార్గాల్లో రక్షిత తాగునీటి కేంద్రాన్నీ ఏర్పాటు చేస్తున్నా మన్నారు. భక్తుల అవసరాలకు సుమారు 32 వేల ట్యాప్ అవుట్‌లెట్లు, 3 వేల వాటర్ ఏటీఎంల ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. పుష్కరాలలో వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, ప్లేట్ల వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. తాగునీటి రీఫిల్లింగ్ కేంద్రాలతో పాటు ప్లాస్టిక్ గ్లాసుల స్థానంలో స్టీల్ లేదా పర్యావరణహిత ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదానాలు, ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ ల్లోనూ ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని నివారించాలన్నారు.
తిరుమలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ అమలును స్ఫూర్తిగా తీసుకుని గోదావరి పుష్కరాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. పర్యావరణహిత పరిష్కారాలతో ముందుకు రావాలని ఏజెన్సీలను కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్, ఎస్ఈ రీటా, ఈఈ మాధవి, సంబంధిత అధికారులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జగనన్న ముఖ్యమంత్రి కావడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

### -వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్న పాటంశెట్టి సూర్యచంద్ర.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 22:**పేద,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,వైయస్ జగన్మోహనరెడ్డి మళ్ళీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిచే వరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు.మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సూర్యచంద్ర సతీమణి, శ్రీదేవితో సహా పలువురు ముఖ్యమైన అనుచరులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సూర్యచంద్ర దంపతులకు వారి అనుచరులకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ కొండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు. 2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఓటు కోసం వచ్చి అన్ని పనులు చేసేస్తాము మరొకసారి అవకాశం ఇవ్వండి అని మాయమాటలతో మళ్లీ మోసం చేయడానికి ప్రజల వద్దకు వస్తున్న కూటమి నాయకులను నమ్మవద్దని సూర్యచంద్ర ప్రజలను కోరారు. జగ్గంపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చేసిన మంచి పనులను గుర్తు చేస్తూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన విధానాలను ప్రజలకు వివరించాలని సూర్యచంద్ర కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com